# కష్టసుఖాల మేళవింపు - తీపి చేదుల ఉ(యు)గాది పచ్చడి

## (30 మార్చి "విశ్వావసు ఉగాది పర్వదినం" సందర్భంగా)

ఉగాది లేదా యుగాది అనబడే "చంద్ర - సౌర క్యాలండర్" లేదా "పంచాంగం" ప్రకారం దక్షిణ భారత తెలుగు రాష్ట్రాలు, కర్నాటక ప్రజలు ఘనంగా నిర్వహించుకునే నూతన సంవత్సర తొలి రోజు వేడుక. యుగ అనగా యుగం అని, ఆది అనగా ప్రారంభ లేదా తొలి రోజు అని అర్థం. యుగాది అనగా యుగానికి మొదటి రోజు అని అర్థం చేసుకోవాలి. పంచాంగ వివరాల ప్రకారం 60 సంవత్సరాల క్యాలెండర్ లేదా "సాకా సంవత్" ప్రకారం, గ్రెగోరియన్ క్యాలెండర్ తేదీ 30 మార్చి 2025న విశ్వావసు నూతన సంవత్సరం ప్రారంభం అవుతున్న శుభ గడియల్లో చైత్ర మాస వేళ ఉగాది పర్వదినాన్ని జరుపుకోవడం అనాదిగా వస్తున్నది.

### ఉగాది పర్వదినాన పరమార్థం:

ప్రతి ఏట మార్చి లేదా ఏప్రిల్ నెలల్లో ఈ పండుగ వస్తుంది. 12వ శతాబ్దపు గణితశాస్త్రవేత్త భాస్కరాచార్య ప్రారంభించిన ఉగాది పండుగను కృష్ణావతార సమాప్తి తర్వాత నిర్వహించడం విశేషం. పురాణాల ప్రకారం రాముడు వనవాసం పూర్తి చేసి అయోధ్యకు వచ్చిన శుభ గడియలను ఉగాదిగా భావిస్తారు. విశ్వాన్ని బ్రహ్మ సృష్టించిన తొలి రోజుగా కూడా ఉగాదిని పరిగణిస్తారు.

### భారతంలో పలు పేర్లతో యుగాది:

ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లో ఉగాది పండుగ జరుపుకుంటూ ఉండగా మహారాష్ట్రలో 'గుడి పడ్వా', తమిళనాడులో 'పతండు', అస్సాంలో 'బిహూ', పంజాబ్‌లో 'బైసాఖీ', రాజస్థాన్‌లో 'తపన', మణిపూర్‌లో 'సాహిబ్ నోంగ్మా పంబ', పశ్చిమ బెంగాల్లో 'నబ వర్షా', సింధు సమాజంలో 'చెట్టీ ఛాంద్' పేర్లతో ఉగాదిని జరుపుకోవడం మన భారతీయ సాంప్రదాయం. ఆధ్యాత్మిక, సాంస్కృతిక, వ్యవసాయ సీజన్ ప్రత్యేకతగా ఉగాది పర్వదినం జరుపుకుంటున్నాం. ఆనందం, సంపదలు, సమన్వయ సమాజ వేడుకగా ఉగాదికి గుర్తింపు ఉన్నది.

### షడ్రుచుల ఉగాది పచ్చడి పరమార్థం:

ఉగాదితో మొదలై నవరాత్రుల పాటు దుర్గా మాతను పూజించే సంస్కృతి కూడా ఉన్నది. ఈ పర్వదినం రోజున తైల మర్ధనంతో స్నానాలు చేసి, తీపి చేదుల కలయికగా షడ్రుచుల ఉగాది పచ్చడి (వేప పువ్వు, మామిడి ముక్కలు, చింతపండు, బెల్లం లేదా చక్కెర, కారం లేదా పచ్చి మిరపకాయ, ఉప్పు)ని తీర్థ ప్రసాదాల వలె తీసుకొని జీవితంలో కష్టసుఖాలను పంచుకునే ధైర్యాన్ని పోగుచేసుకొని, మందిరాల్లో పూజలు చేసుకొని, ఊరు వాడ సంబరాలు చేసుకొని, భక్షాలు లేదా బొబ్బట్లు లాంటి రుచికరమైన పిండి వంటలతో సరదాగా, భక్తి భావనలతో పంచాంగ శ్రవణాలకు హాజరై తమ రాశీ ఫలాలను తెలుసుకోవడం ఆచారంగా వస్తున్నది.

ఆరు రుచుల ఉగాది పచ్చడి జీవిత పరమార్థాన్ని వివరిస్తుంది. కష్టాల్లో కుంగడం, సుఖాల్లో పొంగడం సరియైన జీవన విధానం కాదని ఉగాది పర్వదినం బోధిస్తున్నది. ఆశావహ దృక్పథ సుగుణం, పరస్పర సహకార భావన, ఐక్యత, వివేకవంతమైన జీవనశైలిని అలవాటు చేసుకొని పౌర సమాజం శాంతి సౌభాగ్యాలతో ముందుకు సాగాలని కోరుకుందాం. విశ్వావసు సంవత్సర ఉగాది శుభాకాంక్షలను తెలియజేద్దాం.



-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హెచ్ఏఎం) ద్వారా బీహార్‌లో 120.10 కిలోమీటర్ల పొడవున నాలుగు లేన్ల గ్రీన్‌ఫీల్డ్, బ్రౌన్‌ఫీల్డ్

న్యూఢిల్లీ, మార్చి 29:బీహార్ లోని పాట్నా నుంచి ససారం (120.10 కి.మీ) వరకు నాలుగు లేన్ల యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్ ఫీల్డ్ , బ్రౌన్ ఫీల్డ్ పాట్నా - అర్రా - ససారం కారిడార్ నిర్మాణానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈరోజు సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ) ఆమోదం తెలిపింది. మొత్తం రూ.3,712.40 కోట్ల పెట్టుబడితో హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హెచ్ఏఎం) ద్వారా ఈ ప్రాజెక్టును చేపడతారు.

ప్రస్తుతం ససారం, అర్రా, పట్నా మధ్య కనెక్టివిటీ ప్రధానంగా రాష్ట్ర రహదారులు (ఎస్ హెచ్-2, ఎస్ హెచ్ -12, ఎస్ హెచ్ -81, ఎస్ హెచ్ -102) ద్వారా కొనసాగుతోంది. అయితే అర్రా పట్టణం సహా ఆ మార్గంలో భారీ ట్రాఫిక్ కారణంగా ప్రయాణానికి 3-4 గంటల సమయం పడుతోంది. భారీగా పెరుగుతున్న ట్రాఫిక్‌ను తగ్గించేందుకు గ్రీన్‌ఫీల్డ్ కారిడార్‌తో పాటు 10.6 కిలోమీటర్ల బ్రౌన్‌ఫీల్డ్ హైవేను కూడా అభివృద్ధి చేయనున్నారు. ఇది అర్రా, గ్రహిణి, పిరో, బిక్రమ్‌గంజ్, మోకర్, ససారాం వంటి భారీగా విస్తరించిన ప్రాంతాల అవసరాలను తీర్చడానికి దోహదపడుతుంది.

ఈ ప్రాజెక్ట్ మార్గాన్ని ఎన్ హెచ్-19, ఎన్ హెచ్-319, ఎన్ హెచ్-922, ఎన్ హెచ్-131జి, ఎన్ హెచ్-120 వంటి ప్రధాన రవాణా మార్గాలతో అనుసంధానించనున్నారు. ఇది ఔరంగాబాద్, కైమూర్, పాట్నాకు నిరంతర రవాణా సదుపాయాన్ని అందిస్తుంది. ఇంకా, ఈ ప్రాజెక్ట్ పాట్నాలోని జయ ప్రకాశ్ నారాయణ అంతర్జాతీయ విమానాశ్రయం, నిర్మాణంలో ఉన్న బిహిత విమానాశ్రయంతో పాటు, ససారాం, అర్రా, దానాపూర్, పాట్నా మొదలైన నాలుగు 4 ప్రధాన రైల్వే స్టేషన్లు, అలాగే పాట్నాలోని ఒక అంతర్గత జల మార్గ టర్మినల్‌కు అనుసంధానం కల్పిస్తుంది. ఇది పాట్నా రింగ్ రోడ్డుకు ప్రత్యక్ష అనుసంధానంతో, సరుకులు, ప్రయాణికుల వేగవంతమైన రవాణాకు తోడ్పడుతుంది.

పాట్నా-అర్రా-ససారం కారిడార్ నిర్మాణం పూర్తయితే అది ఈ ప్రాంత ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది. లక్నో, పాట్నా, రాంచీ, వారణాసిల మధ్య రవాణా అనుసంధానం మరింత మెరుగు పడుతుంది. ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతకు అనుగుణంగా ఉన్న ఈ ఈ ప్రాజెక్టు మౌలిక సదుపాయాలను పెంచి ఉపాధి కల్పనతో పాటు బీహార్ సామాజిక-ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుంది. ఈ ప్రాజెక్టు 48 లక్షల పనిదినాలను సృష్టిస్తుంది. పట్నా, దాని చుట్టుపక్కల విస్తరిస్తున్న ప్రాంతాలలో అభివృద్ధి, సంపద పెరుగుదలకు కొత్త అవకాశాలను అందిస్తుంది.

# వర్షాకాలంలో మహానంద ఆయకట్టులో 2050 మిలియన్ క్యూబిక్ మీటర్ల కోసీ జలాల మళ్లింపు

న్యూఢిల్లీ, మార్చి 29:బీహార్‌లోని కోసీ - మెచి నదుల అనుసంధాన ప్రాజెక్టును జలశక్తి మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రధానమంత్రి కృషి సించాయి యోజన సత్వర నీటిపారుదల ప్రయోజనాల కార్యక్రమం (పీఎంకేఎస్ వై-ఏఐబీపీ)లో చేర్చడానికి ఆమోదం లభించింది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన శుక్రవారం సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ) ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.

2029 మార్చి నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేయడం కోసం బీహారుకు రూ. 3,652.56 కోట్ల కేంద్ర సాయాన్ని కూడా సీసీఈఏ ఆమోదించింది. కాగా, ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.6,282.32 కోట్లు.

కోసి మెచి నదీ అనుసంధాన ప్రాజెక్టులో భాగంగా ఇప్పుడున్న తూర్పు కోసీ ప్రధాన కాలువను పునర్నిర్మించడం, దానిని మరో 41.30 కిలోమీటర్లు- మేచీ నది దాకా 117.50 కిలోమీటర్ల వరకు విస్తరించడం ద్వారా.. కోసీ నది మిగులు జలాల్లో కొంత భాగాన్ని బీహార్‌లోని మహానంద పరీవాహక ప్రాంతానికి మళ్లించాలని భావిస్తున్నారు. తద్వారా బీహార్ గుండా ప్రవహిస్తున్న కోసి, మేచి నదులను బీహార్ లోనే అనుసంధానించవచ్చు.

ఈ ప్రాజెక్టు బీహార్‌లోని అరారియా, పూర్నియా, కిషన్‌గంజ్, కతిహార్ జిల్లాల్లో ఖరీఫ్ సమయంలో 2,10,516 హెక్టార్లలో అదనపు వార్షిక నీటిపారుదల సదుపాయాన్ని అందిస్తుంది. ప్రతిపాదిత అనుసంధాన కాలువ ద్వారా కోసి నదిలోని దాదాపు 2,050 మిలియన్ క్యూబిక్ మీటర్ల మిగులు జలాలను మళ్లించే/ఉపయోగించుకునే సామర్థ్యం ఈ ప్రాజెక్టుకు ఉంది. అంతేకాకుండా ఇప్పుడున్న తూర్పు కోసీ ప్రధాన కాలువను పునర్నిర్మించిన తర్వాత.. దాని ప్రస్తుత పరీవాహక ప్రాంతం 1.57 లక్షల హెక్టార్లకు నీటి సరఫరాలో లోటును పునరుద్ధరిస్తారు.

ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన (పీఎంకేఎస్ వై) 2015-16లో ప్రారంభమైంది. వ్యవసాయ క్షేత్రాలకు నీటి లభ్యతను మెరుగుపరచడం, సాగు విస్తీర్ణాన్ని పెంచి నీటిపారుదలకు భరోసా కల్పించడం, వ్యవసాయ క్షేత్రాల్లో నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచడం, సుస్థిర జల సంరక్షణ పద్ధతులను ప్రవేశపెట్టడం మొదలైనవి ఈ కార్యక్రమ లక్ష్యాలు.

2021-26 కాలానికి పీఎంకేఎస్ వై అమలుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీని మొత్తం వ్యయం రూ.93,068.56 కోట్లు (కేంద్ర సాయం రూ.37,454 కోట్లు). పీఎంకేఎస్ వైలో భాగమైన సత్వర నీటిపారుదల ప్రయోజన కార్యక్రమం (ఏఐబీపీ) ప్రధాన, మధ్య తరహా నీటిపారుదల ప్రాజెక్టుల ద్వారా నీటిపారుదల సామర్థ్యాన్ని పెంచడం లక్ష్యంగా పెట్టుకుంది.

పీఎంకేఎస్ వై - ఏఐబీపీ కింద ఇప్పటివరకు 63 ప్రాజెక్టులు పూర్తయ్యాయి. 2016 ఏప్రిల్ నుంచి 26.11 లక్షల హెక్టార్లకు అదనపు నీటిపారుదల సామర్థ్యాన్ని కల్పించారు. 2021-22 నుంచి పీఎంకేఎస్ వై-2.0 మొదలుపెట్టిన తర్వాత ఏఐబీపీలో తొమ్మిది ప్రాజెక్టులను చేర్చారు. కోసి- మెచి అనుసంధాన ప్రాజెక్టు ఇందులో చేరిన పదో ప్రాజెక్టు.

# కొత్త నోటరీ పోర్టల్

న్యూఢిల్లీ, మార్చి 29:నోటరీ చట్టం-1952, నోటరీ నియమాలు-1956 కు సంబంధించిన పనులకు ఆన్‌లైన్ సేవలను అందించడానికి ప్రత్యేక వేదికగా ప్రభుత్వం నోటరీ పోర్టల్‌ను ప్రారంభించింది. నోటరీలుగా నియామకం కోసం దరఖాస్తుల సమర్పణ, నోటరీలుగా నియామకానికి అర్హత ధ్రువీకరణ, నోటరీగా ప్రాక్టీస్ కోసం డిజిటల్ సంతకం చేసిన ధ్రువీకరణ పత్రం జారీ, ప్రాక్టీస్ ధ్రువీకరణ పత్రం పునరుద్ధరణ, ప్రాక్టీస్ ప్రాంతాన్ని మార్చుకోవడం, వార్షిక రిటర్నుల సమర్పణ వంటి వివిధ సేవల కోసం నోటరీలకూ ప్రభుత్వానికీ మధ్య ఆన్‌లైన్ వినిమయ వేదికగా సేవలందించడానికి ఉద్దేశించినది ఈ పోర్టల్. స్వయంగా కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, భౌతికంగా పత్రాలను సమర్పించాల్సిన అవసరం లేకుండా ఒక పారదర్శకమైన, సమర్థమైన వ్యవస్థ నోటరీ పోర్టల్ ద్వారా ఏర్పాటవుతుంది. అయితే, కొత్తగా నియమితులైన నోటరీల పత్రాలు, అర్హత ధ్రువీకరణ, ప్రాక్టీస్ కోసం డిజిటల్ సంతకం చేసిన ధ్రువీకరణ పత్రం జారీ విభాగాలు మాత్రమే ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. నోటరీ పోర్టల్ ప్రారంభించకముందు నోటరీలకు ప్రాక్టీస్ కోసం ధ్రువీకరణ పత్రాన్ని భౌతికంగా జారీ చేసేవారు. ఈ ఏడాది మార్చి 25 నాటికి నోటరీ పోర్టల్ ద్వారా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కొత్తగా నియమితులైన నోటరీలకు ప్రాక్టీస్ కోసం 26,600 కన్నా ఎక్కువ సంఖ్యలో డిజిటల్ సంతకం చేసిన ధ్రువీకరణ పత్రాలు జారీ అయ్యాయి.

న్యాయ శాఖ సహాయ (స్వతంత్ర హోదా), పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి శ్రీ అర్జున్ రామ్ మేఘ్వాల్ ఈరోజు లోకసభలో ఇచ్చిన ఓ లిఖితపూర్వక సమాధానంలో ఈ సమాచారాన్ని అందించారు.

# చిట్టచివరికి వారు దొరికారు..



అమరావతి, మార్చి 29:ఆరుగురు విద్యార్థుల మిస్సింగ్ కేసు ఎట్టకేలకు సుఖాంతమైంది. ఐదురోజుల తర్వాత.. శనివారం ఆ పిల్లల ఆచూకీ లభ్యమైంది. తల్లిదండ్రులు మందలించారనే వాళ్లు అలా వెళ్లిపోయినట్లు సమాచారం. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని మండల కేంద్రమైన ఆలమూరు శివారు కండ్రిగ (యానాదుల) పేటకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఈనెల 24వ తేదీన స్కూల్‌కు వెళ్లి తిరిగి రాలేదు. బడి, ఇల్లు తప్ప ఏం తెలియని చిన్నారులు అలా కనిపించకుండా పోయేసరికి అంతా ఆందోళన చెందారు. చుట్టుపక్కల గాలించి.. బంధువులను ఆరా తీసి చివరకు స్థానిక పోలీసులను ఆశ్రయించారు. ఈ ఉదంతం స్థానికంగా కలకలం రేపింది. వాళ్లంతా బొబ్బా జయశ్రీ బాలికోన్నత పాఠశాలలోనే చదువుతున్నారు. స్థానికుల సాయంతో పోలీసులు చుట్టుపక్కల గాలించారు. వాళ్ల ఫొటోలను మీడియాలో, సోషల్ మీడియాలో వైరల్ చేశారు. డ్రోన్ సాయంతో పరిసర ప్రాంతాల్లో అన్వేషించారు. నాలుగు రోజులైనా ఆచూకీ తెలియరాకపోవడంతో అంతా కంగారుపడ్డారు.

చివరకు పి.గన్నవరం మండలం పెదమాల లంకలో మొక్కజొన్న రైతులకు విద్యార్థులు కనిపించారు. అయితే వాళ్లు ఆకలితో ఉండడంతో భోజనం పెట్టి పంపించి వేశారు. ఈ క్రమంలో సిద్ధాంతం వద్ద ఉన్న లంకలో బాలబాలికను గుర్తించిన పోలీసులు చివరకు ఆలమూరుకు తరలించారు. తల్లిదండ్రులకు అప్పగించడంతో కథ సుఖాంతమైంది.

# రోడ్డు ప్రమాదం.. మహారాష్ట్ర ఐపీఎస్ అధికారి దుర్మరణం

అమరావతి, మార్చి 29:నాగర్ కర్నూల్ జిల్లాలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన ఐపీఎస్ అధికారి దుర్మరణం చెందారు. అమ్రాబాద్ మండలం శ్రీశైలం హైవేలో వగవరపల్లి దోమలపెంట మధ్యలో ఎదురుగా వస్తున్న బస్సును కారు ఢీకొట్టింది. అయితే ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందగా, అందులో సుధాకర్ పటేల్ అనే ఐపీఎస్ అధికారి ఉన్నట్లు గుర్తించారు.

వీరంతా కారులో మహారాష్ట్ర నుంచి బయల్దేరి శ్రీశైలం వెళుతున్నట్లుగా సమాచారం. ఈ ప్రమాదంలో గాయపడిన మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం నల్లమల అటవీ ప్రాంతం దోమల పెంట గ్రామానికి సుమారు ఐదారు కిలోమీటర్ల దూరంలో ఇవాళ మధ్యాహ్నం ఈ రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.

ఈ ప్రమాదం పై ఈగలపెంట ఎస్సై వీరమల్లు సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి కొందరు శ్రీశైలం మల్లన్న దర్శనానికి ఇన్నోవా కారులో వెళ్తున్నారు. సరిగ్గా దోమలపెంట గ్రామ సమీపంలోకి రాగానే శ్రీశైలం వైపు నుంచి హైదరాబాద్ వెళుతున్న పీకేట్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు, ఇన్నోవా కారు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇన్నోవా కారులో ఉన్న ఇద్దరికీ బలమైన గాయాలు అయ్యాయన్నారు. వెంటనే ఆ ఇద్దరు క్షతగాత్రులను ఒక ప్రైవేటు అంబులెన్స్ తో పాటు ఈగలపెంట ఎస్సై పోలీసు వాహనంలో అచ్చంపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి ప్రథమ చికిత్స నిమిత్తం పంపించారు.

క్షతగాత్రుల్లో ఒకరు డాక్టర్ సుధాకర్ పటేల్ ఐపీఎస్ మహారాష్ట్ర, రాజేంద్రనగర్ పోలీస్ అకాడమీలో విధులు నిర్వహిస్తున్నారని, ఈయనకు తలపై బలమైన గాయాలు అయినట్లు సమాచారం. మరొక వ్యక్తి భగవత్ కృష్ణారావు రెండు కాళ్లకు బలమైన గాయాలయ్యాయని సమాచారం. అచ్చంపేట ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ ప్రధాన రహదారి వెల్దండ సమీపంలో ఉన్న ఎన్నం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఇద్దరు మరణించారు.

# మున్సిపల్ వైస్ ఛైర్ పర్సన్ స్వర్ణమణిపై అనర్హత వేటు



అమరావతి, మార్చి 29:మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ లాభాల స్వర్ణమణి పై అనర్హత వేటుపడింది. ఏడవ వార్డు కౌన్సిలర్‌గా ప్రాతనిధ్యం వహిస్తున్న ఆమె సమాచార హక్కు చట్టం, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా చట్టబద్దంగా పొందిన అనుమతుల మేరకు నిర్మించిన భవనాలపై ఫిర్యాదులు చేస్తున్నట్లు టేబుల్ అజెండాలో పేర్కొన్నారు. తరచూ వివాదాలు సృష్టించి స్వలాభం కోసం ఫిర్యాదులు చేసి అనంతరం వాటిని ఉపసంహరించుకున్నట్లు ప్రస్తావించారు. ఫిర్యాదుల వ్యవస్థను ప్రజాప్రయోజనాల కోసం కాకుండా వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నట్లు గుర్తించినట్లు అందులో పొందుపరిచారు.

పురపాలక చట్టం 1965, సెక్షన్ 17 అనుసరించి మున్సిపల్ కమిషనర్ గత నెల 25న ఆమెకు లేఖ ద్వారా తెలియపరిచినట్లు అజెండాలో ప్రస్తావించారు. కొన్ని ఆధారాల వివరాలను టౌన్ ప్లానింగ్ అధికారి వినయ ప్రసాద్ కౌన్సిల్ కు వివరించారు. చివరకు కొద్ది మంది మినహా సొంత పార్టీ వైసీపీ సహా టీడీపీ సభ్యులు అనర్హత అంశంకు మద్దతు పలికారు. ఈలోగా చైర్ పర్సన్ పిలక రాజ్యలక్ష్మి మెజార్టీ సభ్యుల ఆమోదం కోరగా చేతులు పైకి ఎత్తి తమ మద్దతు తెలపడంతో ఆమోదిస్తున్నట్లు ప్రకటించారు. దీనిపై స్వర్ణమణి మండిపడ్డారు. తనకు కనీసం మాట్లాడే అవకాశం లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# 2 శాతం పెంపుతో ఖజానాపై ఏడాదికి రూ.6614.04 కోట్ల భారం

న్యూఢిల్లీ, మార్చి 29:కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరవు భత్యం (డీఏ), పింఛన్‌దారులకు డియర్‌నెస్ రిలీఫ్ (డీఆర్)ను పెంచుతూ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం ఆమోదాన్ని తెలిపింది. ఇది మూల వేతనం/పింఛన్‌లో 53 శాతంగా ఉన్న ప్రస్తుత రేటు కన్నా 2 శాతం అదనంగా ఇస్తారు. ఈ పెంపు ఈ ఏడాది జనవరి 1 నుంచి వర్తిస్తుంది. పెరిగిన ధరల భారం నుంచి ఉపశమనాన్ని కలగజేయాలనేది ఈ నిర్ణయంలోని ఉద్దేశం.

డీఏ (డియర్‌నెస్ అలవెన్స్), డీఆర్.. పెంచినందువల్ల ప్రభుత్వ ఖజానాపై ప్రతి సంవత్సరం రూ. 6,614.04 కోట్ల మేరకు భారం పడుతుంది. ఈ నిర్ణయంతో, కేంద్ర ప్రభుత్వంలోని సుమారు 48.66 లక్షల మంది ఉద్యోగులకు, 66.55 లక్షల మంది పించనుదారులకు ప్రయోజనం చేకూరుతుంది.

ఏడో వేతన సంఘం ఆమోదించిన సూత్రానికి అనుగుణంగా ఈ పెంపు నిర్ణయాన్ని తీసుకున్నారు.

# మైనారిటీల జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తాం- సుజనా చౌదరి



అమరావతి, మార్చి 29:మైనారిటీల సంక్షేమం అభివృద్ధి వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు, మాజీ కేంద్రమంత్రి యలమంచిలి సత్యనారాయణ (సుజనా) చౌదరి తెలిపారు. ముస్లిం సోదరులకు అండగా ఇటు రాష్ట్ర ప్రభుత్వం, అటు కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని భవానిపురంలో సుజనా చౌదరి కూటమి నేతలతో కలిసి సయ్యద్ గాలిబ్ షహీద్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. అలాగే రంజాన్ పండుగ సందర్భంగా స్థానికులకు రంజాన్ తోఫాను పంపిణీ చేశారు.

ఈసందర్భంగా సుజన చౌదరి మాట్లాడుతూ? పవిత్ర రంజాన్ మాసంలో ఖురాన్ అవతరించడం ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం సోదరులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలో ముస్లిం సోదరులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారనీ, ఎన్నికల్లో తనను ఎంతగానో ఆదరించి, అభిమానించి గెలిపించిన వారికి కచ్చితంగా ఎల్లవేళలా అండగా ఉంటానన్నారు. మళ్ళీ రంజాన్ వచ్చే నాటికి మైనార్టీల జీవన ప్రమాణాలు మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిమ్ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేసే నేపథ్యంలో వారికి కావలసిన తగిన ఏర్పాట్లు చేయనున్నట్లు ప్రకటించారు. గతంలో కన్నా ఇక్కడ పరిస్థితులు మెరుగు పరచడానికి అన్ని విధాలా ప్రణాళిక వేస్తున్నామన్న ఆయన ముఖ్యంగా మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

# వాకర్స్‌తో మాటామంతీ .. చిరు బండి వద్ద అల్పాహారం

నల్లగొండ, మార్చి 29 ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శనివారం నల్లగొండ పట్టణంలో సుడిగాలి పర్యటన చేశారు. వేకువజామునే లేచి ఆయన పట్టణంలోని మార్నింగ్ వాకర్స్ తో కలిసి నడిచి మాటా మంతీ గడిపారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రామగిరి సెంటర్ లో రోడ్డు పక్కన సువర్ణ అనే మహిళ బండి వద్ద కోమటిరెడ్డి తన అనుచరులతో కలిసి టిఫిన్ చేశారు.

తనకు ఇల్లు లేదని, ఉన్న కొద్దిపాటి భూమిపై కిరికిరి ఉండడంతో అధికారులు న్యాయం చేయడం లేదని ఆమె మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన మంత్రి అక్కడే ఉన్న ఎమ్మార్వోను పిలిచి సువర్ణ భూమి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

అనంతరం మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి శేషమ్మ గూడెం సమీపంలోని సీవరేజ్ ట్రీట్ మెంట్ ప్లాంట్ ను పరిశీలించారు.

నెలలోపు ఎస్టీపీ ని పూర్తిచేయాలని ఇంజనీరింగ్ అధికారులకు మంత్రి కోమటిరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. నల్గొండ పట్టణంలో సుమారు 80 శాతం ఇండ్లు 20 ఏళ్ల కింద సీవరేజ్ ట్రీట్ మెంట్ కు అనుసంధానం చేశారని . మంత్రి చెప్పారు. 2014లో రూ. 38 కోట్లతో ఎస్టీపీ మంజూరైనప్పటికీ నేటికీ పూర్తి కాకపోవడం బాధాకరం అని ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటేశ్వర కాలనీ ,రాఘవేంద్ర కాలనీ అన్నింటికీ ఎస్టీపీ కనెక్షన్లు ఉన్నాయని పేర్కొన్నారు. రానున్న 25 ,30 రోజుల్లో ఎస్టీపీని పూర్తి చేయాలని మున్సిపల్, ఇంజనీరింగ్ అధికారులను, పబ్లిక్ హెల్త్ అధికారులను ఆయన ఆదేశించారు. సీవరేజ్ ట్రీట్ మెంట్ ప్లాంట్ పూర్తి చేసి చుట్టూ గార్డెన్ ఏర్పాటు చేయాలని సూచించారు. నర్సప్ప గూడ వద్ద అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో మరో ఎస్టీపీ నిర్మాణం చేపట్టనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రకటించారు. ప్రజలు ఇబ్బందులు పడే పనిని తానెప్పుడు చేయబోనని చెప్పారు.



# మహిళలకు వడ్డీ లేని రుణాలు

## -పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క



ఏటూరునాగారం,మార్చి 29: మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నామని, రాష్ట్రంలో రూ.23 వేల కోట్ల వడ్డీ రుణాలు అందజేసినట్లు పంచాయతీరాజ్, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. మండల కేంద్రంలో వలు కార్యక్రమాల్లో సీతక్క శనివారం పాల్గొన్నారు. ఐటిడిఏ కార్యాలయం ఆవరణలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభించి, దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, చేతి కర్రలు, వినికిడి పరికరాలు అందజేశారు. 50 మందికి కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీతక్క మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. రూ.9కోట్ల వడ్డీని మహిళా సంఘాలకు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏటూరు నాగారంలోని చైతన్య మండల సమాచారం రూ.86 లక్షల చెక్కును అందజేశారు. కొండాయి సమీపంలోని చెంపన్న వాగుపై రూ.16 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం చేసేందుకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.

ఏటూరునాగారంలో బస్సు డిపో మంజూరు చేసామని వచ్చే నెల టెండర్లు పిలవడం జరుగుతుందని తెలిపారు. ఏటూరు నాగారంలో బస్సు డిపో అవసరాలు ఎక్కువగా ఉన్నాయని ఆమె వివరించారు. ములుగులో బస్టాండ్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఏటూరు నాగారం, ఉట్నూరు ఐటిడిఏ కార్యాలయ భవనాలు శిథిలావస్థలో ఉన్నందున ఒక్కో భవనానికి రూ.15 కోట్ల చొప్పున మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

దివ్యాంగులు తీసుకున్న ఉపకరణాలతో కొత్త జీవితం ప్రారంభించుకోవాలని సూచించారు. మంగపేట, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం, మండలాలకు చెందిన 297 మంది లబ్ధిదారులకు రూ.40 లక్షల విలువచేసే ఉపకరణాలను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి వెంట కలెక్టర్ దివాకర టీఎస్, శివం ఉపాధ్యాయ, డిఆర్డిఓ సంపత్ రావు వివిధ విభాగాలకు చెందిన అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# కమాండోలు నిబద్ధతతో సేవలందించాలి

## -సీఐఎస్ఎఫ్ ఏపీఎస్ స్పెషల్ డైరెక్టర్ ప్రవీర్ రన్‌జన్ ఐపీఎస్

హైదరాబాద్, మార్చి 29: దేశ భద్రతలో సీఐఎస్ఎఫ్ కమాండోలు నిబద్ధతతో కూడిన సేవలదించాలని, కార్యదీక్షతతో సమాజాభివృద్ధిలో భాగస్వాములైతేనే ప్రత్యేక గుర్తింపు వస్తుందని సీఐఎస్ఎఫ్ ఏపీఎస్ స్పెషల్ డైరెక్టర్ ప్రవీర్ రన్‌జన్ ఐపీఎస్ పిలుపునిచ్చారు.

శుక్రవారం హకీంపేట్‌లోని నీసా నేషనల్ ఇండస్ట్రీయల్ అథారిటీ దీక్షంత్ పరేడ్ మైదానంలో శిక్షణ పొందిన 37వ బ్యాచ్ అసిస్టెంట్ కమాండోలు 69మంది పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగాప్రవీర్ రన్‌జన్ ఐపీఎస్ హాజరై అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన కమాండోలకు అవార్డులతో పాటు ట్రోఫీలను అందజేశారు. ఈకార్యక్రమంలో నీసా డైరెక్టర్ ఎస్ ఆర్ శరవరణ్ ఐపీఎస్, అధికారులు, కమాండోల తల్లిదండ్రులు, నీసా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ పునర్‌నిర్మాణంలో భాగస్వాములు కండి: దాసరి కృష్ణ

హైదరాబాద్, మార్చి 29:హరిహర క్షేత్రం శ్రీ చిలుకశ్వేర అంజనేయు స్వామి దేవాలయం గాయత్రి మాత, ఉప ఆలయముల పునర్‌నిర్మాణ పనుల్లో భాగంగా స్లాబ్ పనులు ఆలయ కమిటీ సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు దాసరి కృష్ణ మాట్లాడుతూ అత్యంత పురాతనమైన దేవాలయం చిల్కానగర్ లోని ప్రధాన ఆలయం శివాలయం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నిర్మాణం పనులు ఆలయకమిటీ ఆధ్వర్యంలో వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్లాబ్‌కు అవసరమైన కాంక్రీట్ అందించారని, చిల్కానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ స్లాబ్ కు అవసరమైన స్టీల్ ఇచ్చారని, అలాగే ఆలయ నిర్మాణం కోసం ఎంతోమంది దాతలు ముందుకు వచ్చి విరాళాలు ఇచ్చారని తెలిపారు.

వారి అందరికీ ఆలయకమిటీ తరుపున మరియు చిల్కానగర్ గ్రామ ప్రజల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియచేస్తున్నామనీ చెప్పారు. ఇప్పటివరకు ఒక కోటి రూపాయల వ్యయంతో మొదటి



అంతస్తు స్లాబ్ పనులు పూర్తి చేశామని, ముఖ్యమైన ఘట్టం రాతి కట్టడంతో ఆలయముల నిర్మాణం జరుగనున్నద ని పేర్కొన్నారు. ఆలయ నిర్మాణం కోసం దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. రాబోయే రోజుల్లో చిల్కానగర్ లోని ప్రతి గడపకు ఆలయకమిటీ సభ్యులు వస్తారని, అందరూ పెద్ద మనసుతో విరాళం అందించి గుడి పున్నరునిర్మాణంలో బాగ స్వాములు కావాలని కోరారు. ఈకార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షులు దాసరి కృష్ణ, ప్రధాన కార్యదర్శి గోనె శ్రీకాంత్, ఆలయ కమిటీ సీనియర్ సభ్యులు గ్రామ పెద్దలు శంభు ప్రసాద్, బూరుగుల రమేష్ గౌడ్, గోనె అంజయ్య, అమృత్ రావు, ఆడెపు అంజయ్య, జెల్లి మోహన్, దేవసాని బాలచందర్, సిద్దిరాజు, పి.గౌరయ్య , అంబటి జగదీష్, మొట్టే రమేష్, ఆర్.బలరాం, పాల్వంచ విఠల్ ,దాసరి శ్రీనివాస్, ముక్కల రామకృష్ణ, గోపాల్ రెడ్డి, కొంపల్లి రవీందర్, ఎస్.చంద్రయ్య, కొంపల్లి బాలరాజు, బి.కృష్ణ, కావాలి నర్సింహ్మా, వీరారెడ్డి, ఎన్.రాంచందర్, స్వామి యాదవ్, ఈ. రవీందర్ రెడ్డి, పున్నం రాజు, మధుసూదన్ రెడ్డి, పిట్లల నరేష్, అంజి గౌడ్, పల్లె నర్సింగ్ రావు, పారుపాటి రాంరెడ్డి, విద్యసాగర్, పిట్లల శ్రీరాములు, పైడిపాల సాయిలు, దండు అంజయ్య, వాసు, ఉమేష్ సింగ్, ఎస్. ప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి, అశోక్ చారి, కొంపల్లి రాజు, మల్లేష్, బొల్లం లక్ష్మణ్, గుర్రాల మల్లేష్, కృష్ణ ముదిరాజ్, మడిపడిగే శ్రీనివాస్, పెరుమాళ్ శివ, సునీల్ నాయక్, యం. శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఇఫ్తార్ మత సామరస్యానికి ప్రతీక :

## వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్

ఖమ్మం, మార్చి 29: ఇఫ్తార్ విందు ఆత్మీయుత, మత సామరస్యానికి ప్రతీకని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. ఖమ్మం జిల్లా సింగరేణి మండల కేంద్రంలోని జామే మసీద్‌లో శనివారం రాత్రి మండలానికి చెందిన ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మత పెద్దలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లిం ఉపవాస దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ మాసంలో చిన్నపిల్లల నుంచి మొదలుకుని వృద్ధుల వరకు కఠోర నియమాలతో ఉపవాస దీక్షలు చేయడం గొప్ప విషయమన్నారు. రంజాన్ మాసంలో చేపట్టే ఉపవాస దీక్షలు ఎంతో భక్తి శ్రద్ధలతో పాటిస్తారని, అల్లా ఆశీస్సులు ఎల్లప్పుడూ అందరికీ ఉండాలని కోరారు. ఇఫ్తార్ విందులతో సోదర భావం పెంపొంది ప్రజల మధ్య ఐక్యత పెరుగుతుందన్నారు. అల్లా ఆశీస్సులతో ప్రతి ఒక్కరు సుఖశాంతులతో ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జామే మసీద్ కమిటీ సభ్యులతో పాటు ముస్లిం మత పెద్దలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# మిస్ వరల్డ్ పోటీలను ప్రతిఘటిద్దాం

## - పీవోడబ్ల్యూ నాయకురాలు వీ సంధ్య

హైదరాబాద్, మార్చి 29:మిస్ వరల్డ్ అందాల పోటీలను




ప్రతిఘటించాలని పలువురు మహిళా సంఘం నాయకురాలు పిలుపునిచ్చారు. మిస్ వరల్డ్ అందాల పోటీల వ్యతిరేక వేదిక ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అందాల పోటీలపై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రచయిత్రి జూపాక సుభద్ర, పీవోడబ్ల్యూ జాతీయ నాయకురాలు సంధ్య మాట్లాడారు.

మే నెలలో హైదరాబాదులో ప్రపంచ సుందరి పోటీలను తెలంగాణ టూరిజం ,హెరిటేజ్ , సాంస్కృతిక శాఖ నిర్వహిస్తుందని తెలిపారు. మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ అధినేత జూలియా మోర్లీ తదితరులు తెలంగాణకు, ముఖ్యంగా హైదరాబాదుకు ఉన్న ఘన చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను పరిగణలోకి తీసుకొని అందాల పోటీలకు వేదికగా నిర్ణయించామని ప్రకటించారని తెలిపారు.

అయితే తెలంగాణ రాష్ట్రం ఎంతో పోరాట చరిత్ర గలదని, నైజాం రాజులకు , దొరలకు , భూస్వాములకు, యూనియన్ సైన్యానికి, వడ్డీ వ్యాపారస్తులకు ఎదురొడ్డి నిలిచిన సాయుధ రైతాంగ పోరాట వారసత్వం ఈ నేల సొంతమని అన్నారు. రజాకారులపై తిరగబడ్డ ఆత్మస్థైర్యం ఇక్కడి మహిళలది పేర్కొన్నారు. స్వాతంత్రం వచ్చి 77 ఏళ్లు గడిచినా ఇంకా 26 శాతం అక్షర జ్ఞానానికి దూరంగా ,పేదరికంలో 143 దేశాలలో 136వ దేశంగా ,ఆకలి సూచీలో 116 దేశాల్లో 101 గా ఉన్న భారతదేశంలో 80 కోట్ల మంది ప్రజలు ఆహార భద్రత పథకంలో రేషన్ బియ్యం కొరకు ఎదురుచూస్తున్నారని తెలిపారు.

దేశంలో అందాల పోటీలు ఎవరికోసమని ప్రశ్నించారు. అందాల పోటీల మీద పెట్టే ఖర్చుతో గ్రామీణ హాస్టళ్లు, పాఠశాలల్లో మంచినీళ్లు , టాయిలెట్ సౌకర్యాలను, వైద్య సౌకర్యాలను, చారిత్రక ప్రదేశాలలో వనతులను, భద్రతను మెరుగువరచవచ్చని వారు వెల్లడించారు. మహిళలకు , యువతకు , వ్యాయామశాలలు ,గ్రంథాలయాలు ఏర్పాటు చేయవచ్చని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వివిధ మహిళా సంఘాల నాయకులు అనసూయ , ఆశాలత, స్వరూప, జ్యోతి , శ్రీదేవి ,లావణ్య , స్త్రీ విముక్తి, శాంత , జ్యోతి, జయ, ఝాన్సీ, ప్రదీప్, జాన్, మహేష్, సత్య, తేజ, జ్యోతి వహీద్,అంబిక, అనిల్, మమత ,అరుణ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన సంక్షేమం మరియు సమ్మిళిత వృద్ధికి ప్రజా విధానం మరియు ఆర్థికం అనే అంశంపై ఒక రోజు వర్క్‌షాప్



న్యూఢిల్లీ, మార్చి 29:పాలసీ సంవాద్, ఇన్స్టిట్యూట్ ఫర్ పబ్లిక్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఎఖఖఖీఅ) మరియు మహామన మదన్ మోహన్ మాలవీయ మెమోరియల్ ట్రస్ట్ సహకారంతో న్యూఢిల్లీలోని మాలవీయ స్మృతి భవన్‌లో "భవిష్యత్తుకు నిధులు సమకూర్చడం: గిరిజన సంక్షేమం మరియు సమ్మిళిత వృద్ధికి ప్రజా విధానం మరియు ఆర్థికం" అనే శీర్షికతో ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించింది.

ప్రారంభ సమావేశానికి పాలసీ సంవాద్ ఎడిటర్ మరియు పబ్లిక్ పాలసీ విశ్లేషకుడు గౌరవ్ కుమార్ నాయకత్వం వహించారు, ఆయన అతిథులను స్వాగతించారు మరియు వర్క్‌షాప్ యొక్క ఇతివృత్తాన్ని వివరించారు. ముఖ్య అతిథిగా, షెడ్యూల్డ్ తెగల జాతీయ కమిషన్ చైర్మన్ శ్రీ అంతర్ సింగ్ ఆర్య, ప్రజా విధాన రంగంలో నిర్మాణాత్మక సంభాషణ మరియు గిరిజన సంక్షేమంపై అవగాహన పెంచడంలో సహకారం కోసం పాలసీ సంవాద్ పాత్ర మరియు ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ పాత్రను ఆయన వివరించారు మరియు ప్రస్తుత కేంద్ర బడ్జెట్‌లో గిరిజన సంక్షేమం కోసం వివిధ కార్యక్రమాలను హైలైట్ చేశారు, గిరిజన వర్గాల సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఆయన ప్రస్తావించారు.

గౌరవ అతిథిగా, ఎన్‌సిఎస్‌టి సభ్యుడు శ్రీ నిరుపమ్ చక్మా, ప్రజా ఆర్థిక రంగంలో సమగ్ర మరియు సమగ్ర అభివృద్ధి మరియు దాని సమర్థవంతమైన నిర్వహణ అవసరాన్ని నొక్కి చెప్పారు. ఎన్‌హెచ్‌ఆర్‌సి మాజీ యాక్టింగ్ చైర్‌పర్సన్ మరియు సభ్యురాలు శ్రీమతి విజయ భారతి సయాని కూడా ఈ అంశంపై తన అంతర్దృష్టులను పంచుకున్నారు. మహామన మాలవీయ మిషన్ జాతీయ అధ్యక్షురాలు శ్రీ హరిశంకర్ సింగ్, గిరిజన సంక్షేమం మరియు విధాన రూపకల్పనలో ప్రజా విధానం మరియు ఆర్థిక పాత్ర గురించి చర్చించారు. అదనంగా, ఎన్‌సిఎస్‌టి జాయింట్ సెక్రటరీ శ్రీ అమిత్ నిర్మల్, గిరిజన సంక్షేమం మరియు సమ్మిళిత అభివృద్ధిని నిర్ధారించడంలో ప్రజా విధానం మరియు ఆర్థిక ప్రాముఖ్యతపై తన దృక్పథాన్ని అందించారు.

ఈ వర్క్‌షాప్‌లో డొమైన్ నిపుణులు, విధాన నిర్ణేతలు మరియు వాటాదారుల మధ్య చర్చలు జరిగాయి, వారు ప్రజా సంక్షేమం కోసం కొత్త మార్గాలను అన్వేషించారు. పండితులు మరియు పరిశోధకులు గిరిజన అభివృద్ధి యొక్క గతం, వర్తమానం మరియు భవిష్యత్తు గురించి విలువైన అంతర్దృష్టులను అందించారు. డాక్టర్ ప్రకాష్ చంద్ కందపాల్ (ప్రొఫెసర్ ), ప్రొఫెసర్ పవనేష్ కుమార్ (ఇగ్నో), శ్రీ చక్షు రాయ్ ( లెజిస్లేటివ్ రీసెర్చ్), శ్రీ వినయ్ కుమార్ సింగ్ (సీనియర్ ఫెలో, డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఫౌండేషన్), శ్రీ ఒఐ చౌబే (జనరల్ సెక్రటరీ, భారతీయ ఆదివాసీ సేవక్ సంఘ్), శ్రీ ప్రకాష్ ఉయ్కే (మాజీ న్యాయమూర్తి), మరియు డాక్టర్ అభిషేక్ శ్రీవాస్తవ (అసిస్టెంట్ ప్రొఫెసర్, ఏఔఐ) ముఖ్య వక్తలు.

ఈ కార్యక్రమంలో, పాలసీ సంవాద్ యొక్క పదవ సంచికను ముఖ్య అతిథి మరియు ప్రత్యేక ఆహ్వానితులు విడుదల చేశారు. ప్రముఖ ప్రొఫెసర్లు మరియు విశ్లేషకుల సలహా మండలి నిర్వహించే ఈ జర్నల్, పాలన, సామాజిక -ఆర్థిక అభివృద్ధి మరియు నీతి ఆయోగ్ యొక్క చొరవలపై దృష్టి సారిస్తుంది, భారతదేశ విధాన దృశ్యంపై మేధోపరమైన చర్చకు కీలకమైన వేదికగా పనిచేస్తుంది.

డాక్టర్ ప్రవీణ్ కుమార్ ఝా ముగింపు వ్యాఖ్యలతో ఈ కార్యక్రమం ముగిసింది. వర్క్‌షాప్‌లో పండితులు, పరిశోధకులు, విశ్వవిద్యాలయ విద్యార్థులు మరియు పబ్లిక్ పాలసీ నిపుణులు పాల్గొన్నారు, వీరిలో పిఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ ప్రతినిధులు కూడా ఉన్నారు.

# రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

ఆదిలాబాద్, మార్చి 29:రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం దండేపల్లి మండలంలోని మ్యాదరిపేటలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని (ఓవటతిఇఃజీశ్రీ అజీఏజూ)మంచిర్యాల జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ పేదలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. వారికి వైద్యచికిత్సలు ఉచితంగా అందించేందకు నిర్వహిస్తున్న శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలు మంచిర్యాల అసెంబ్లీ లోని అన్ని మండలాల్లో ఏర్పాటు చేయనున్నామని వివరించారు. రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య, నాయకులు వోటవలుకుల గురువయ్య, గాజుల ముఖేష్ గౌడ్, దంకా లక్ష్మణ్, పిట్టల అశోక్, బెదద సురేష్, ఎంబడి సురేందర్, పత్తిపాక సంతోష్, బత్తుల శేఖర్, ముత్తినేని మల్లేష్, నలివెల మహేష్, బోడకుంటి వెంకటేష్, ముత్తె అనిల్, పతిపాక శ్రీనివాస్, ముత్తె వెంకటేష్, వనపర్తి రాకేష్ , తదితరులు పాల్గొన్నారు.

# ఐలోని మల్లన్న హుండీ ఆదాయం రూ.కోటి 22 లక్షల 25 వేల 561

## -మల్లన్న ఆదాయం రోజుకు రూ.4 లక్షల 89 వేల 22

## -25 రోజులకు హుండీ, టిక్కెట్లు ద్వారా వచ్చిన ఆదాయం

వరంగల్, మార్చి 29: ఐనవోలు మల్లికార్జునస్వామి దేవస్థానం దినదిన ప్రవర్ధమానం చెందుతొంది. అతి పురాతనమైన చాలా పవిత్రమైన చరిత్ర కలిగిన ఆలయం. ఈ ఆలయానికి భక్తుల తాకిడి రోజు రోజుకు పెరుగుతుంది అనడానికి సాక్ష్యమే ఈ సమకూరిన ఆదాయం. ఈ నెల 4 నుంచి 29 వరకు అంటే 25 రోజులకు గాను హుండీ, వివిధ రకాల టిక్కట్ల ద్వారా సమకూరిన ఆదాయమే నిదర్శనం.

దేవస్థానం ఆదాయం రోజుకు గాను రూ. 4 లక్షల 89 వేల 22 సమాకూరింది. బ్రహ్మోత్సవాలలో భాగంగా సుమారుగా రోజుకు రూ.4.89 లక్షల ఆదాయం సమకూరిదంటే ఆలయాని భక్తుల తాకిడి ఏ స్థాయిలో పెరిగిందో అర్థం అవుతున్నది.

కాగా ఐనవోలు మల్లికార్జునస్వామి హుండీ ఆదాయం, టిక్కెట్ల ద్వారా వచ్చిన ఆదాయంను శనివారం ఆలయ ఈవో అద్దంకి నాగేశ్వర్ రావు తెలిపారు.

25 రోజులకు గాను 23 హుండీలను తెరిచి లెక్కించగా రూ.25 లక్షల 96 వేల, 561 వచ్చినట్లు వెల్లడించారు. వివిధ రకాల టిక్కెట్ల ద్వారా వచ్చిన ఆదాయం రూ.96 లక్షల 29 వేలు సమకూరినట్లు పేర్కొన్నారు. హుండీ, టిక్కెట్ల ద్వారా దేవాలయానికి వచ్చిన మొత్తం ఆదాయం రూ.1 కోటి 22 లక్షల 25 వేల 561 వచ్చినట్లు ఈవో ప్రకటించారు.

ఈ లెక్కింపునకు పరిశీలకులుగా డీ అనిల్ కుమార్, ఈవో అద్దంకి నాగేశ్వర్ రావు, కానిస్టేబుల్స్ జి పరమేశ్వరి, యాస్మిన్, శ్రీనివాస్, శ్రీ లక్ష్మి వెంకటేశ్వర సేవాసమితి మహబూబాబాద్, అర్చకులు, సిబ్బంది కిరణ్, శ్రీకాంత్, కన్నయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

# మాట నిలబెట్టుకోవడం చాలా సంతోషంగా ఉంది : ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి



మెదక్, మార్చి 29: ఇఫ్తార్ విందులో ముస్లిం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించి మాటను నిలబెట్టుకన్నారు. ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి గత కొన్ని రోజుల క్రితం ముస్లిం సోదరులకు ఇచ్చిన ఇఫ్తార్ విందులో పట్టణ సమీపంలోని ఈద్గా ప్రాంగణంలో విద్యుత్ సమస్యను పరిష్కరించేలా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించాలని ముస్లిం మత పెద్దలు, ముస్లిం ప్రజలు కోరడం జరిగింది.

వారి కోరిక మేరకు ఎమ్మెల్యే 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయించడం జరిగింది. ఈ మేరకు ఇవాళ నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించగా.. ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం ప్రజలకు ఈద్గా వద్ద విద్యుత్ సమస్య తలెత్తకుండా ఉండడానికి వారి కోరిక మేరకు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంతో చాలా సంతోషంగా ఉందని వెల్లడించారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ని ఏర్పాటు చేయించినందుకు ముస్లిం ప్రజలు, ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సత్యంగౌడ్, ముస్లిం ప్రజలు మౌలానా మసియోద్దీన్, లాయక్ అలీ ఖాన్, షేక్ హుస్సేన్, ముజాహెద్‌ఖాన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేఖర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# గురుకులాల నిర్వహణ వైఫల్యానికి ఇదొక నిదర్శనం.. కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు ధ్వజం

హైదరాబాద్, మార్చి 29:సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం నల్లవాగు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి నిఖిల్ మరణం చాలా బాధాకరమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఈ కష్టసమయంలో వారి కుటుంబసభ్యులకు ధైర్యాన్ని ప్రసాదించాలని ఆ భగవంతుణ్ని ప్రార్థించారు. 83 మంది గురుకుల విద్యార్థులు చనిపోతే కనీస దిద్దుబాటు చర్యలు చేపట్టని కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి, ఈ మరణం మరొక ఉదాహరణ అని ఆయన అన్నారు.

చిన్న జ్వరానికే విద్యార్థులు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి రావడం శోచనీయమని హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గురుకులాల నిర్వహణ వైఫల్యానికి ఇదొక నిదర్శనమని మండిపడ్డారు. ఒక గురుకులంలో 400 మంది విద్యార్థులనే సమర్థవంతంగా చూసుకోలేని ప్రభుత్వం.. 2000 మంది ఉండే ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్వహణను ఎలా చేయగలదని నిలదీశారు. గురుకులాల్లో చదువుతున్న దళిత, బహుజన విద్యార్థుల ప్రాణాలను రక్షించే చర్యలు చేపట్టాలని సూచించారు. చనిపోయిన విద్యార్థి నిఖిల్ కుటుంబానికి రూ.15 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని బీఆర్ఎస్ తరపున డిమాండ్ చేశారు.

పెద్ద శంకరంపేట మండలం చీలపల్లి గ్రామానికి చెందిన దార నిఖిల్ కుమార్ (14) సిర్గాపూర్ మండలం పరిధిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఆహారం బాగోలేకపోవడంతో వారం రోజులుగా అతను సరిగ్గా భోజనం చేయడం లేదు. దీంతో విద్యార్థి ఆరోగ్యం విషమించింది. ఈ విషయాన్ని నిఖిల్ తల్లిదండ్రులకు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ తెలియజేశారు. కంగారుపడిపోయిన తల్లిదండ్రులు వెంటనే పాఠశాలకు చేరుకుని.. నిఖిల్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లారు.


శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినం & ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా

శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు

**సామాజిక కవి సమ్మేళనం**

30.03.2025 సాయంత్రం 4.00 గంటలకు

TSUTF

St.మేరీస్ హై స్కూల్ హైదరాబాద్ రోడ్,జనగామ

ముఖ్య అతిథి :- డా.పోరెడ్డి రంగయ్య, అధ్యక్షులు, యా.భువనగిరి జిల్లా రచయితల సంఘం

సభాధ్యక్షులు :- పొట్టబత్తిని భాస్కర్, గౌరవాధ్యక్షులు, జనగామ జిల్లా రచయితల సంఘం

అతిథులు :- పి.చంద్రశేఖర్ రావు, అధ్యక్షులు TSUTF,జనగామ; మడూరి వెంకటేష్, ప్ర.కార్యదర్శి TSUTF,జనగామ; ఆకుల శ్రీనివాసరావు, TSUTF,FWF బోర్డు ఆఫ్ డైరెక్టర్

సమన్వయ కర్తలు :- తాళ్ళపెల్లి లక్ష్మణ్ గౌడ్, అధ్యక్షులు, TSUTF,లింగాల ఘనపూర్; గుండె కనకయ్య, ప్రధాన కార్యదర్శి, TSUTF,బచ్చన్నపేట

జనగామ జిల్లాలోని సమస్త కవులు, రచయితలు ఈ కవి సమ్మేళనంలో పాల్గొని సమకాలీన సామాజిక అంశాలపై తమ అభిప్రాయాలను కవిత్వం రూపంలో వెల్లడించగలరని మనవి.

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్,జనగామ

## కొత్త ఆశలు సరికొత్త ఆశయాలే

కొత్త ఆశలు ఆకాంక్షలు
సరికొత్త ఆశయాలు
సుస్థిర విశ్వాసాలు
ఉప్పొంగే ఉత్సాహంతో
విశ్వావసు నామ ఉగాది
నూతన వత్సరంలో
వేసే ప్రతి అడుగు
ప్రగతి పథం కావాలి
పురోగతికి బాట కావాలి
వృద్ధికి అభివృద్ధికి
పునాది కావాలి .
అంకితభావం సంకల్పశక్తి
అవగాహన చైతన్యం
విజయాల సాధనకు
ఆయుధం కావాలి
నైపుణ్యం సృజన
మేళవింపుతో దేశ
సంపదను సౌభాగ్యాన్ని
పెంచాలి.
సామాజిక ఆర్థిక సమతా
సాంఘీక ఆర్థిక పంపణీ
సమ న్యాయం సిద్ధించాలి.
పేదరికం నిరుద్యోగం
ఆర్థిక దోపిడి
లింగ వివక్ష
సమాన హక్కులు
సమాన వేతనాలు
బాలకార్మిక వ్యవస్థ
వుమెన్ ట్రాఫికింగ్
అవినీతి నేర
రాజకీయాలు
అంతరించాలి
అభివృద్ధి ఫలాలు
సామాన్యునికి చేరువ
కావాలి.
మహిళా యువత
సాధికారిత సాధన
సమాజ అభివృద్ధిలో
ప్రభుత్వం పౌర సమాజ
భాగస్వామ్యం పెరగాలి
సుపరిపాలన జవాబుదారీ
పాలనకు పెద్దపీట వేయాలి
అభివృద్ధి రాజకీయాలు
అవతరించాలి.
ఆత్మీయత
అనురాగాల
మేళవింపుతో
అనుబంధాలు
వికసించాలి.
మమత
మానవీయత
కేంద్రంగా కుటుంబ
వ్యవస్థ బలపడాలి.
మనోధైర్యంతో
ముందడుగు వేసే
మనో వైఖరి
ఉద్దీపనతో
మానవ వనరుల
వికాసం సిద్ధించాలి.
సహనం సాహసం
సమత మమత
మానవీయత
సమన్వయం
సంఘీభావం
అవగాహన
సాధనాలుగా
నిత్య సంతోషం
సంతృప్తి సమాజ
జీవన శైలి కావాలి.
పర్యావరణ రక్షణ
నీటి సంరక్షణ
సహజ వనరులరక్షణ
దేశ భాషల పట్ల
స్వాభిమానం
స్వదేశీ స్వాభిమానం
జాతి కార్యాచరణ
కావాలి.
సంకల్ప శక్తితో
జాతి శక్తి సామర్థ్యాలు
ఇనుమడించాలి
ఉన్నత జీవన
ప్రమాణాలతో
మెరుగైన సమాజం
నిర్మాణంతో విశ్వంలో
భారత్ ను
అగ్రస్థాయికి చేర్చాలి.
(అందరికి ఉగాది శు
భాకాంక్షలు)



-నేదునూరి కనకయ్య
9440245771

## ఉగాది

నూతన సంవత్సరాది ఉగాది
శుభకార్యాలకు ప్రారంభ స్వాగతం
పలుకుతూ, ఉగాది పచ్చడి
షడ్రుచులు సమ్మేళనం
తీపి, కారం, చేదు, పులుపు
వగరు, ఉప్పుతో ఉగాది
పచ్చడిని సేవిస్తాము.....
మామిడి తోరణాలతో ఇల్లు
దర్శనము ఇస్తూ
పిల్లలు, పెద్దలు కొత్త బట్టలు
పూజలు పునస్కారాలతో
ఆనందోత్సాహంలో కుటుంబాలు....
పంచంగా శ్రావణలతో
పండుగ వాతావరణం
తలపిస్తుంది.....
ఈ ఏడాది సంపాదన ఎక్కువ
వ్యయం తక్కువ ఉండాలని
వేడుకుంటూ, పాడి పశువులు
పసిడి పంటలు, ధాన్యగారాలతో
తుల తూగుతూ రైతుల ముఖాలలో
చిరునవ్వు వేరివియుస్తూ,
ప్రజలందరు ఆయుర్ ఆరోగ్యాలతో
ఉండాలని కోరుకుంటూ.
శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో
శుభాలు కలగాలని ఆశిద్దాం.



– మిద్దె సురేష్
9701209355

## ఉగాది శిఖరం

అరుణ కిరణాలతో
అవనిలో పొద్దు పొడిచింది
అఖిల జనావళి నిదుర నుండి
కళ్ళు తెరిచింది
శుచిగా మంగళ స్నానాలాచరించింది
గృహాలు తోరణాల పట్టు వస్త్రాలతో
కొలువు తీరింది.
అంబర సంబరాలతో
నూతన ఉగాది వచ్చింది
పసందుగాహృది గది చేరింది
గత స్థానం క్రోధి తిరిగి వెళ్ళింది
మరల విశ్వా వసు తెరమీదికొచ్చింది .
చెట్లు చేమలు చిగురులతో విరిసింది
కోకిలమ్మల కూతలతో ధరణి పల్లవించింది
నింగి నేలను ముద్దాడుతున్నది
ధరాతలం దరహాసాలొలుక బోస్తున్నది.
ప్రకృతి పండగపరువముతో కడు మక్కింది
షడ్రుచులను ప్రియంగా త్రాగించింది
ఆరోగ్యానికి ఔషదమని పేర్కొన్నది
విశ్వావసు ప్రేమ పంచుతున్నది.
విప్రులను వేదికలపై ఎక్కించింది
పంచాంగశ్రవణం మొదలు పెట్టించింది
ఆదాయ వ్యయాలకు , క్రుంగ కంటున్నది
రాజపూజ్యాలకు
పొంగిపో వలదంటున్నది.
పంచభక్ష పరమాన్నాలతో కడుపు నింపింది
ఆయాసంతో శరీరం మునకలేస్తున్నది
యుగాది
హిందువుల సనాతన ప్రతిబింబమైనది
భారతీయ సంస్కృతికి
శిఖరమై నిలిచినది



-నమిలకొండ
నాగేశ్వర్ రావు
8688553470

## విశ్వపు'రంగులరాట్నం'

కసికసిగా సాగుతోంది కాలం
వడివడిగా ఒడిసెలరాయి ఇసిరినట్టు
కోపతాపాల దాహంతో.
కొరవడిన విలువలతో
నేలకొరుగుతున్న నడి ఈడు
ఛిద్రమవుతున్న సమాజం.
వెతుకుతుంది మది
ఎతలు తీరే దారేమైనా
దొరుకుతదేమోనని
ఐనా శిశిరంలోరాలే ఆకులేగా
సింతలన్నీ.
తరం మారుతోంది
తలరాతల నిశీధిలోన
ప్రకృతి మిణుగురుల గమనంలో.
యుగాల పయనాలెన్నో
క్రమక్రమంగా ప్రభవించే
అక్షయ దాకా రంగులరాట్నమోలే
మైలురాయిగా నిలిచెనిపుడు 'విశ్వావసు'.
కాలచక్రమేదైనా
నడవాలి జీవన చక్రం
ఋతువుల ఆగమానాలు
నిలపాలి నిండు ప్రాణాలు
కాకూడదు పర్యావరణ విధ్వంసం
నిండిపోవాలి ప్రకృతి పచ్చదనం.
విశ్వమంతా విరాజిల్లు సంస్కృతి సౌరభాలు
వసుధైక కుటుంబకమై
నిలవాలీ పరిమళాలు.



-కమలేకర్ నాగేశ్వర్ రావు
9848493223.

## విశ్వావసు సుగంధాలు

విశ్వావసు ఆరంభ శుభ గడియలు
చైత్ర మాసపు తొలి అడుగులు
ఉగాది సందడుల హరివిల్లులు
షడ్రుచుల పచ్చడి ఆస్వాదనలు
జీవితంలో చేదైన కష్టనష్టాలు
బతుకుల్లో తీపి సుఖసంతోషాలు
పులుపు కూర్చిన ఆయురారోగ్యాలు
కారం ఘాటు పచ్చడి ప్రసాదాలు
చిటికెడు ఉప్పు చేయు ఉపకారాలు
నోరూరించే పసందైన బక్షాలు, బొబ్బట్లు
ప్రకృతి మాతకు శతకోటి ప్రణామాలు !.
వ్యాపార వస్తువులైన డిజిటల్ ప్రేమలు
క్విడ్ ప్రో కో సిద్ధాంతాలైన సంబంధాలు
ఆవిడ చుట్టు అశ్లీల ముళ్ళ చూపులు
ప్రకృతికి తూట్లు పొడిచే కేటుగాళ్లు
ఆస్తులు, ఓట్ల చుట్టూ రాజకీయాలు
అమ్మపాలను అమ్ముకునే అకాలాలు
అధికారికి శక్తినిస్తున్న అమ్యామ్యాలు !.
విశ్వావసు తరమాలి అమానవీయతలు
చిగురింపజేయాలి నైతిక విలువలు
అక్రమార్కుల ఒల్లంతా కొరడా వాతలు
సాపు చేయాలి సైబర్ నేరగాళ్ల వీపులు
దూగడ పట్టాలి దుశ్శాసన ఆలోచనలు
దేహశుద్ధితో అర్భులు వెన్నుపోటుగాండ్లను
వెకిలి నవ్వుల వెనుక విష భావనలు
'అయితే నాకేంటి' అంటున్న అసురులు !.
జీవన ఆయుధాలకు పదునుపెట్టి..
నరకాలి మృగాళ్ల అశ్లీల దుర్బుద్దులు
ప్రక్షాన చేయాలి కౌరవ పాలనలు
నీతి నియమాలకు కట్టాలి పట్టాలు
చదువుకు తోడవ్వాలి విలువలు
రేపటి తరానికి ఇవ్వాలి ఆరోగ్య గాలులు
నిర్మించాలి సత్ప్రవర్తన రాచ మార్గాలు
భూమాతకు కట్టాలి హరిత చీరలు
విశ్వావసు వడ్డించాలి పరమానందాలు !



-మధుపాళీ
9949700037

## మన ఉగాదిముచ్చట్లు

ఉగాది ఆగమనం
తెలుగోళ్ళకు సంతోషం
తెలుగువారి తొలిపండుగ
తెలుగుజాతి పెద్దవేడుక.
చైత్రమాసం ఆరంభం
వసంతకాలం ప్రారంభం
ఋతువు మార్పు
కొత్తవత్సరం మొదలు.
మల్లెల గుబాళింపులు,
కోకిలల కుహూకుహూలు
పంచాంగ శ్రవణాలు,
షడ్రుచుల ఆరగింపులు
కవితల సమ్మేళనాలు, కవులకు సన్మానాలు
శుభాకాంక్షలు చెప్పటాలు,
కలసి యుగాదిసంబరాలు.
కొత్తబట్టల ధరించటం
గడపలకు తోరణాలుకట్టటం
కొత్తకోడళ్ళు కోడరికానికిరావటం
సలిబిండిపందేరాలు
ఉగాదిసంప్రదాయం.
గుళ్ళల్లో పూజలు
దేవుళ్ళ ఊరేగింపులు
భాజాభజంత్రీలు భజనలు
కోలాటకోలాహలాలు
మధుమాసమాధుర్యాలు.
విశ్వావసు ఉగాదికి
ఆహ్వానం పలుకుదాం
నూతన సంవత్సరాన్ని
ఆనందంగా
గడుపుకుందాం



-గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్
సెల్: 7981616630

## నవ్య ఉగాదికి స్వాగతం

అందరిలాగే, ఎప్పటిలాగే
ఇప్పుడు వీడ్కోలు తీసుకుంటున్న
ఈ సంవత్సరానికి
అప్పుడు నేనూ స్వాగతం పలికాను
ఏదో మంచి కోసమని
ఎదురు చూడనూ చూశాను
అర్ధాంగి అనారోగ్యాన్ని కానుక ఇచ్చింది
నాలోని సహనానికి
సంపూర్ణంగా పరీక్ష పెట్టింది
వృద్ధాప్యం పైన పడుతున్నా
శతమానం వైపు అడుగువేస్తూ
అనారోగ్యంతో అమ్మ చేస్తున్న పోరాటం
నాలో ఆరాటాన్ని రేకెత్తించింది
అమ్మ, ఆలి, 'అఆ'ల మధ్య
నాలో చెలరేగిన అంతర్మథనానికి
భగవాన్ రమణుల ఆశీస్సు ఒకటి
నాకు ఛత్రచ్ఛాయగా నిలిచింది
ఇప్పుడు విశ్వావసు పైన
నాకు విశ్వాసం బలపడుతున్నది
క్రోధి మిగిల్చిన ఆక్రోశాన్ని
దూరం చేస్తుందని
సరికొత్త మంజీర నాదాలు
మళ్ళీ ఉషోదయాన్ని సందళిస్తాయని
చైత్రానికి చిగురులు పుట్టినట్టు
అమ్మ ఆశీరక్షతలతో
నా ముంగిట్లో
మళ్లీ వసంతం మొలక వేస్తుందని
ఆశగా
నవ్య ఉగాదిని ఆహ్వానిస్తున్నాను.
మీకూ శుభాలు కలగాలని
శుభాకాంక్షలదిస్తున్నాను.



– మద్దాళి రఘురాం
సెల్:9866057777



# అలరించిన ఉగాది కవి సమ్మేళనం



హైదరాబాద్, మార్చి 29:మంగళకరమైన మామిడి తోరణాలతో, మధుమాసపు కోయిల కూతలతో, హాయిని గొలుపే వాసంత సమీరంతో, కష్టసుఖాలను సమంగా భరించగలమనే విశ్వాసాన్ని కలిగించే షడ్రుచుల ఉగాది పచ్చడి సేవనంతో, భవిష్యత్తుకు మార్గదర్శనం చేసే పంచాంగ శ్రవణంతో ,మదినిండా పరుచుకున్న కోటి ఆశలతో వస్తున్న నూతన సంవత్సరానికి స్వాగతం అంటూ పలువురు కవులు తమ కవితా గానాలను చేసి అందరినీ అలరించారు.

శ్రీ విశ్వావసు నామ నూతన తెలుగు సంవత్సరం ప్రారంభం సందర్భంగా ఉగాది కవి సమ్మేళనాన్ని కొల్లాపూర్ పట్టణంలోని రాణి ఇందిరా దేవి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, పూర్వ విద్యార్థుల సహకారంతో శుక్రవారం రోజు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి శ్రీ ఇమ్మానియేల్ గారు సభాధ్యక్షత వహించారు. మాజీ జిల్లా ఉప విద్యాశాఖాధికారి రంగినేని పాపల్ రావు గారు కవి సమ్మేళనాన్ని ప్రారంభిస్తూ, మనం జరుపుకునే పండగలు, ఉత్సవాలు మనలోని ఐక్యతకు చిహ్నాలని, అందరూ కలిసిమెలిసి ఉత్సాహవంతంగా జరుపుకోవడం వెనుక ఎంతో గొప్ప విషయాలు దాగి ఉన్నాయని అన్నారు. ఆత్మీయ అతిథులు గా సూర్యాపేట నయాబ్ తహశీల్దార్ ఏం.డి. రుక్నోద్దిన్, జీ.హెచ్. ఏం.వనజ పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వాహకులు శ్రీ వేదార్థం మధుసూదన శర్మ,డా. గుడెలీ శీనయ్యలు మాట్లాడుతూ, భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలు చాలా గొప్పవని, వాటి యొక్క విలువలను విద్యార్థి దశ నుంచే నేర్పించి, భవిష్యత్ తరాలకు అందివ్వాలని అన్నారు. వీటి ద్వారా విద్యార్థుల్లో మానవీయ, నైతిక, ఆధ్యాత్మిక విలువలను పెంపొందించవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవా ది భూజల భాస్కర్ రెడ్డి, కవులు డాక్టర్ పి రామచంద్రరావు, ఆర్ వెంకటేశ్వర చారి,డాక్టర్ వి. భాస్కర రావుఆమని కృష్ణ, వేములకోటయ్య, బృంగి కృష్ణ ప్రసాద్, రాఘవేందర్, శ్రీదేవి, వరలక్ష్మి ,రాణి,శ్రీ కుమారి, రాధ, కురుమయ్య,గంగయ్య తదితరు లు తమ కవిత గానాలను వినిపించారు.

# 31వ డివిజన్లో ఇంటింటికి కాషాయ ధ్వజం పంపిణీ



కరీంనగర్, మార్చి 29: (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ పట్టణం 31 డివిజన్ పరిధిలోని లక్ష్మినగర్ నివాసి దేవసాని సరస్వతిసత్యనారాయణ ఆధ్వర్యంలో స్వస్తిశ్రీ విశ్వవసు తెలుగు నూతన సంవత్సరం ఉగాది సందర్భంగా ప్రతి ఇంటికి కాషాయ ధ్వజం పంపిణీ చేశారు.

ఇట్టి కార్యక్రమంలో కరుణాకర్, రాజేష్, శంకర్, రామారావు, పాపన్న, పవన్ ,బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నాంపల్లి శ్రీనివాస్, ఓబీసీ రాష్ట కార్యవర్గ సభ్యులు అడిచెర్ల రాజు,ఈస్ట్ జోన్ అధ్యక్షులు అవదుర్తి శ్రీనివాస్, సెంట్రల్ జోన్ కన్వీనర్ తణుకు సాయికృష్ణ, మాసం గణేష్, పసుపులేటి శివానందం, గర్దాస్ సతీష్, వంగ సంపత్ పటేల్, వంశీ. శశికాంత్ రాకేష్ సంతోష్ తిరుపతి, తదితరులుపాల్గొన్నారు.

# సరస్వతి బ్లాక్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో ముందస్తు ఉగాది వేడుకలు



రాజన్న సిరిసిల్ల, మార్చి 29:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని సరస్వతి బ్లాక్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో శనివారం ముందస్తు నూతన తెలుగు వారి తొలి పండుగ ఉగాది వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాఠశాలల డైరెక్టర్ సన్నిధి వెంకట కృష్ణ హాజరై ఈ పండుగ యొక్క ప్రాముఖ్యతను ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సవివరంగా తెలియజేశారు. తెలుగువారు జరుపుకునే అత్యున్నత ముఖ్యమైన పండుగలలో తెలుగువారి తొలి ఒక్కటే పండుగనే ఉగాది ఒకటే అని అన్నారు. అదేవిధంగా ఈ తెలుగు సంవత్సరాదిన మొదలు పెట్టినటువంటి పనులయందు అందరూ విజేతలు కావాలని వారు ఆకాంక్షించారు.

విద్యార్థులకు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, శ్రేయోభిలాషులకు, తెలుగు ప్రజలందరికీ డైరెక్టర్ వెంకటకృష్ణ ముందస్తు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు , తల్లిదండ్రులు పాఠశాలల ప్రిన్సిపాల్ సంతోషం వ్యక్తం చేశారు.

# రంజాన్ ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు

## -ఏర్పాట్లలో ఎక్కడ రాజీ పడవద్దని అధికారులకు సూచన



రాజన్న సిరిసిల్ల, మార్చి 29:(నేటినిజం ప్రతినిధి): పవిత్ర రంజాన్ పర్వదినం పురస్కరించుకొని ఆదివారం వేములవాడ పట్టణం లోని ఈద్గా వద్ద జరిగే ఈద్గా నమాజ్ సంబంధించిన ఏర్పాట్లను ప్రభుత్వ విప్, వేములవాడ శాసన సభ్యులు శ్రీనివాస్ ఆదేశాల మేరకు శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తో కలిసి పరిశీలించారు. ఈ నేపథ్యంలో ఈద్గా వద్ద చేసిన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా వేసవి నేపథ్యంలో త్రాగునీరు, షామియానాలు, టెంట్లు వేసే విషయంలో రాజీ పడవద్దని, అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు వచ్చే అవకాశం ఉన్న తరుణంలో వీలైనన్ని ఎక్కువ సంఖ్యలో టెంట్లు, షామియానాలు, త్రాగునీరూ అందుబాటులో ఉండేలా చూసి వేడుకల్లో పాల్గొనే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మున్సిపల్ అధికారులను కోరారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నందువలన అధికారులు నమోదు ఎందుకు వచ్చే వృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, షమీ యానాల తో పాటు తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని అన్నారు ఇదిలా ఉండగా పలువురు ముస్లిం సోదరులు మాట్లాడుతూ గతంలో కంటే ఈసారి ఏర్పాట్లు చాలా బాగున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా శానిటేషన్ విషయంలో మున్సిపల్ అధికారుల పనితీరు చాలా బాగుందనీ కొనియాడారు. ఈ క్రమంలో ఏర్పాట్లపై ప్రత్యేక చొరవ చూపిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రోండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, పట్టణ, బ్లాక్ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, సాగరం వెంకటస్వామి నాయకులు కూరగాయల కొమరయ్య, వస్తాది కృష్ణ, అబ్దుల్ రజాక్, బింగి మహేష్, నామాల పోశెట్టి, అన్నారం శ్రీనివాస్, పులి రాంబాబు, పుల్కం రాజు, తోట రాజు, పీర్ మహమ్మద్, వలీ, అంబాటి చందు, షాహిద్, సాబీర్, బాబున్న, ఇర్ఫాన్, ముంజ ఉమేందర్, కొక్కుల బాలు, ఎన్నారం సాగర్ తదితరులు ఉన్నారు.

# ఇఫ్తార్ విందులు స్నేహ బంధాన్ని పెంపొందిస్తాయి.. మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయి

## – రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందుకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయంది... గంగా జమున తెహజీబ్ కు ప్రతిరూపంగా మారుతాయని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం వేములవాడ పట్టణంలోని శ్రీనివాస్ ఫంక్షన్ హాల్ లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందుకు ముఖ్యఅతిధిగా హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు కాంగ్రెస్ మైనార్టీ నాయకులు అబ్దుల్ రజాక్, సయ్యద్ సాబీర్, మాజీ ఎంపిటిసి హైమద్ , మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పీర్ మహమ్మద్, ముస్లిం కమిటీ పట్టణ ప్రధాన కార్యదర్శి షాహిద్ ఘన స్వాగతం పలికారు, ఉపవాస దీక్షలు పాటించే ముస్లిం సోదరులకు ఖర్జూర వండ్లు, డ్రైఫ్రూట్స్ ఏర్పాటు చేసి రోజును విరమింపజేశారు. ఈసందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఇఫ్తార్ విందులు స్నేహబంధాన్ని పెంపొందిస్తాయని, హిందూ ముస్లిం ఐక్యతకు మారుపేరుగా నిలుస్తాయన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో అల్లాహ్ మెప్పు కోసం నెల రోజుల పాటు కఠోర మైన ఉపవాస దీక్షలు పాటించి, నెల రోజులు ఖురాన్ పారాయణం, తరావీహ్ నమాజ్ క్రమం తప్పకుండా ఆచరించి పుణ్య ఫలాలు పొందడం గొప్ప ధార్మిక సంకల్పమని కొనియాడారు. అనంతరం ఇస్తార్ విందుకు హాజరైన ప్రభుత్వ విప్ కు పూలమాలలు, శాలువాతో ఇస్లామియ సంప్రదాయ బద్ధంగా ఆత్మీయ సన్మానం చేశారు. ఈ దావాతే ఇఫ్తార్ విందుకు వేములవాడ పట్టణానికి చెందిన సుమారు 5 వందల మంది పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో రెవిన్ డివిజన్ అధికారి రాజేశ్వర్, టౌన్ సీఐ వీరప్రసాద్, తహసిల్దార్ విజయ్ ప్రకాష్ రావు, కాంగ్రెస్ నాయకులు బింగి మహేష్, సాగరం వెంకటస్వామి, చిలుక రమేష్, కూరగాయల కొమురయ్య, నాగుల విష్ణు, పులి రాంబాబు, వలి మొహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.






Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020,Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.